# చొక్కా-బొచ్చు తువ్వాలు

నిలబడి ఒక్కడు అడగలేదు! దోవంట ఎందరో వస్తున్నారు. ఎందరో పోతున్నారు. ఆగి ఒక్కగా నొక్కడు అడగలేదు!

దోవకడా కూలి జనం నిలబెట్టిస్తారనుకున్నాడు వెంకటరెడ్డి. చొక్కా ఎంతైంది? బొచ్చుతువ్వాలు ఎంతైంది? అని అడుగుతారనుకున్నాడు.

ధగధగా మెరిసిపోతున్న నీలం గళ్ళ చొక్కా! బొచ్చు తువ్వాలు! తువ్వాలు కటూ ఇటూ వెడల్పుగా ఎర్రంచులున్నాయి. రెండూ గుమ్మ బజాయించి ఉన్నాయి.

కుట్టు మూర్తుల కొట్లో అంటే రడీమేడ్ బట్టలకొట్లో చొక్కా కొన్నాడు. గంట స్తంభం దాటాక, కూరల మార్కెట్టు తోవలోఎడంపక్క సందులో కుట్టు మూర్తుల దుకాణంలో ఏభై చొక్కాలమధ్య ఏరుకున్న నీలం గళ్ళచొక్కా. అక్కడి కక్కడే కొట్లోనే తొడుక్కుని బైటకొచ్చాడు. మెయిన్‌రోడ్డుమీద పెద్ద పట్టుబట్టల షాపులో కొనుక్కుని పైమీద వేసుకొని వచ్చాడు బొచ్చు తువ్వాలు!

తోవలో చూసినవాళ్ళు మనిషిని ఆపి; చొక్కా ఎంతైంది? తువ్వాలెంతైంది అనడగాలా? ఏం బాగున్నాయని మెచ్చుకోవాలా? తోవపోయే వాళ్ళు ఎవరి మానాన్ని వాళ్ళు పోతున్నారుగాని వెంకటరెడ్డిని తలెత్తి చూడనైనా చూడలేదు.

అందుకే వెంకటరెడ్డి ఎక్కడి కక్కడ తోవకడాకూ ఆగిపోతూ బుర్రొంచుకుంటూ వాడికివాడే చొక్కావేపు వెయ్యిసార్లు చూసుకొన్నాడు. తువ్వాలు రెండు చేతుల్తో విప్పి పట్టుకొని దాని బొచ్చునీ, దాని ఎర్రంచుల్నీ తనివితీరా చూసుకొంటూ మురిసిపోతూ తాపీగా పట్నంనుంచి వాళ్ళవూరికి నడుచుకు పోతున్నాడు. బండి తోవ విడిచిపెట్టి అడ్డంగా పొలాల గట్లమీంచి కాలి బాటని పడ్డాడు.

ఆడా మగా ఎదురొతున్నారు. నలుగురూ మెచ్చుకొంటారని, ఆడవాళ్ళు ఎగాదిగా చూస్తారని అనుకున్నాడు. ఏం లాభం? వాణ్ణీ, వాడి కొత్త బట్టలనీ ఒక్కరు గమనించలేదు? మళ్ళా అర్ధా పర్థాకాదు. నలభై రూపాయల చిల్లర పెట్టి కొనుక్కున్నాడు.

ఈ కాలపు కుర్రాళ్ళు పల్లెటూళ్ళలో ఎన్ని గీరలకి పోతున్నారు! పంట్లాలు, బుష్షర్టు, రిస్టువాచీలు, బూట్లువేసి సైకిళ్ళమీద గొప్ప గోరోజనంతో తిరుగుతున్నారు. వెంకటరెడ్డి అంత పోకిరీలకు పోలేదు. సామాన్యమైన పూర్వోత్తరపు చెవుల చొక్కా, బిన్నీ బొచ్చు తువ్వాలు మాత్రామే కొనుక్కొన్నాడు. వాళ్ళ తాత గోచీతో బతికీశాడు. వాళ్ళయ్య ఓ మెట్టెక్కి బనియ నేసుకొన్నాడు. పంచ కట్టేడు. వెంకటరెడ్డి మరో చిన్నమెట్టు ఎక్కేడు. పెద్దదేంకాదు.

ఇంతకీ ఎందుకు కొనుక్కున్నాడు? వాళ్ళ అత్తవారి గ్రామంలో అమ్మవారి పండుగ దగ్గరపడ్డాది. వాళ్ళ మామ పండక్కి పిలిచాడు. వెళ్ళక తప్పదుకదా? నలుగుర్లో కాస్త మెరుగ్గా కనబడాలి. బొత్తిగా హీనంగా కనబడకూడదు.

వాళ్ళమ్మ ముత్యాలమ్మ. దాని కిష్టంలేదు. వద్దుగాక వద్దంది. పెళ్ళాం కాపరాని కొచ్చాక కొడుకుని కని కొడుకు తండ్రి అయినా తల్లి అడ్డులు పెడితే ఎలాగ? తండ్రి చచ్చేపోయాడు. తనే యింటి యజమాని. అయినా అమ్మ పెత్తనమే ఇంట్లో సాగుతున్నాది. అమ్మ మాటకి వెంకటరెడ్డి విలువ ఇస్తున్నాడు. రెండు గుడ్డముక్కలు కొనుక్కుంటే దానికేం? నాలుగు మడి చెక్కలున్నాయి. తిండానికి ఇన్ని గింజలు పండుతాయి. అయినా అమ్మ పెత్తనం! వెయ్యి పీట ముళ్ళేసి డబ్బు దాస్తుంది. ఎందుకూ బైటకి తియ్యదు.

వాళ్ళమ్మ అందికదా-"ఒరే ఎంకడూ మీ తాత పుట్టగోచీతో బతికి సెమటోడ్చి కష్టపడి సంపాదించినాడురా పల్లం మళ్ళూ. మీ యయ్యని నువ్వెరుగుదువు. నానూ, మీయయ్యా ఎయ్య కూడికలు చేసి కొన్నాములా ఏరుశనగ గరువూ. నువ్వూ మా దోవన పోతేనే మడి సెక్కకి మడి సెక్క కొంటావు. పోకిరీలకి పోయినావా సెడిపోతావు" అన్నాది. మంచికే చెప్పింది. మంచిమాటే చెప్పింది. ఆ తరం తరహా!

ఊరు చివర చెరువు గర్భంలో నలుగురు కుర్రాళ్ళు బిళ్ళాకర్ర ఆడుకుంటున్నారు. ఆటలో మునిగిపోయి ఉన్నారు. వాళ్ళయినా ఓసారి వెంకటరెడ్డిని చూశారుకారు! వెంకటరెడ్డి స్పృహే వాళ్ళకులేదు! పదిహేను పదహారేళ్ళ కుర్రాళ్ళు. అందరూ వెంకటరెడ్డిని ఎరిగినవాళ్ళే!

"ఏంరో పరిదేశి! ఏంరో వెంకటయ్యో!" అని అందులో ఇద్దర్ని వెంకటరెడ్డి పేర్లు పెట్టి పిలిచాడు. నలుగుర్లో వాళ్ళే మొనగాళ్లు. వాళ్ళో సారి తలెత్తి వెంకటరెడ్డిని చూడకపోలేదు. చూశారు. మళ్ళా ఆటలో పడి పోయారు!

"ఓ రిలాగ రాండ్రా!" అన్నాడు వెంకటరెడ్డి. వాళ్ళురాలేదు. పెద్ద వాడు పిలిస్తే రావద్దా?

"ఎందుకెస్సి?" అన్నాడు పరిదేశి.

"ఆడతావా సూడు" అన్నాడు వెంకటయ్య.

"నాలుగు తన్నగల్ను. ఇలాగ రాండెస్సి" అన్నాడు వెంకటరెడ్డి. దాంతో దగ్గరికి రావడం వచ్చారు. వెంకటరెడ్డి కొత్తబట్టలని వాళ్ళు గుర్తించలేదు.

"ఏటిరా ఇక్కడ సేస్తన్నారు?" అనడిగాడు వెంకటరెడ్డి.

"కనబడ్డ నేదా?" అన్నాడు పరిదేశి.

"ఎండ మండిపోతూవుంటే ఎందుకు ఎదవ ఆట?" అన్నాడు వెంకటరెడ్డి.

"అందుకా పిలిచినావు? ఊళ్ళో కెళతావా ఇటూ తోవ. మళ్ళా పట్నం పోతావా అటూ తోవ. ఎటెళ్ళతావో ఎళ్ళు" అన్నాడు వెంకటయ్య.

"ఏటిరో అంత గీరగా మాట్లాడుతున్నావు? టెంక మాడేటట్టు తగల్నిస్తే!" అన్నాడు వెంకటరెడ్డి.

"ఏఁటేటీ? ఏటన్నావు?" అన్నాడు వెంకటయ్య.

"ఏదెయ్యి టెంకి మాడేటట్టు. నీ ఈపు బాజా వాయించీస్తాము" అన్నాడు పరిదేశి.

మాటలు తప్పు తోవకి పోయాయి. వెంకటరెడ్డి కోరిక ఒకటైతే, జరిగింది మరొకటైంది.

"అస్సాని కన్నానురా? మిమ్మల్ని ఆడుకోవద్దని నే నెందు కంటానూ?" అని తగువు పెంచకండా సర్దేశాడు. వెంటనే తనే చెప్పు కున్నాడు.

"పట్నమెళ్ళి చొక్కా, తువ్వాలు కొన్నాను. మీరు కనబడ్డారు పలకరించాను అంతే" అన్నాడు వెంకటరెడ్డి.

"ఓహో కొత్తవి కొన్నావా? మీయమ్మ కొనుక్కోనిచ్చిందా?" అనడిగాడు పరిదేశి. ముత్యాలమ్మ వెంకటరెడ్డిని వెర్రి వెర్రి వేషాలు వెయ్య నివ్వదని ఊరందరూ ఎరుగుదురు పిల్లలతోసహా! వెంకటరెడ్డిని వాళ్ళమ్మ బట్టలు కొనుక్కోమందంటే ఊరు ఊరందరికీ ఆశ్చర్యమే! కుర్రవాళ్ళకి ఆశ్చర్యమే!

"మాయమ్మ ఇష్టమేటి ? నానే కొనుక్కున్నాను" అన్నాడు ధీమాగా. వెంకటరెడ్డి తనకి తాను తల్లిని తలాయించి కొనుక్కున్నమాట వాస్తవమే. కుర్రాళ్ళ వాళ్ళమ్మ నెరుగుదురు.

"మీయమ్మకి తెలకండా కొన్నావంటే ఆ సొక్కాకి మీయమ్మ సాకిరేవెట్టేస్తాది" అన్నాడు పరిదేశి.

"నోరు ముయ్యి ఎదవా?" అని వెంకటరెడ్డి వాళ్ళని వదిలేశాడు. గుంట వెధవలు గుంట వెధవలా! వాళ్ళమ్మ మాట ఎత్తి గంగవెర్రులెత్తిం చారు. తల్లితో తంటాతప్పదు. పెద్దజగడమే అవుతుంది. బట్టలకి వాళ్ళమ్మ డబ్బివ్వలేదు. వాడికి వాడే ఏర్పాటు చేసుకున్నాడు. ధిక్కరించే! అయినా బట్టలు కొనుక్కున్న ఉత్సాహం గ్రామం పొలిమేరలో అడుగుపెట్టగానే గడ్డిమేటలా కూలబడ్డాది.

కుర్రాళ్ళకి దూరంగా వూళ్ళోకి నడిచాడు. వాడు దూరం పోవడం చూసి కుర్రాళ్ళు నలుగురూ కలిసి గట్టిగా అరిచారు.

"ముత్తేలమ్మా ! తేలమ్మా! తేలు!" అని. ఊళ్ళో వాళ్ళమ్మనంతా తేలమ్మా - తేలూ అంటారు - ముత్తేలమ్మ అన్న !

వెంకటరెడ్డి వెనక్కి తిరిగి కుర్రవెధవల్ని చూశాడు. పళ్ళు కొరు క్కున్నాడు. ఊరుముందు కొచ్చాడు. ఊరుముందు కళ్ళాం బక్క నాయుడు కళ్ళాం. బక్కనాయుడు పిసనారి గొట్టుల్లో పిసనారిగొట్టు. కళ్ళాం మధ్యగా నిలబడ్డాడు.

"ఏంరో పట్నమెళ్ళి నావా?" అంటూ పలకరించాడు.

"ఆఁ ఎళ్ళినాను మావాఁ" అంటూ బక్కునాయుణ్ణి తప్పించుకోవా అని ముందుకి అడుగు వేశాడు. బక్కునాయుడు వూరుకునే రకం కాదు. వాడికి అక్కర్లేంది ఊళ్ళోలేదు.

జానెడు చుట్ట నోట్లో పెట్టుకున్నాడు. వో పక్కనుంచి కాల్చి పొగ వదులుతున్నాడు. వోపక్కనుంచి నమిలి రసం మింగేస్తున్నాడు. బక్కునాయుడు వెంకటరెడ్డిని నిదానంగా చూశాడు, పట్టుకున్నాడు.

"ఇనాగ రా" అన్నాడు. వెంకటరెడ్డికి వెళ్ళక తప్పింది కాదు.

"ఏం పనిమీద పట్నమెళ్ళినావు?" అన్నాడు. చూశాడు. పోల్చాడు. అంతా తెలిసే!

"శనక్కాయలు బేరమిచ్చినావా?" అన్నాడు. బక్కునాయుడు. వెక్కిరింపుకే అంటున్నాడు. అదే వాడి నైజం.

"కోడిపిల్లలు రెండుంటే వొట్టుకెళ్ళినాను" అని పచ్చి అబద్ధం చెప్పాడు వెంకటరెడ్డి.

"నానెరగని కోళ్ళు మీయింటికాడెక్కడున్నాయి? ఎందుకురా అబద్ధం? సొక్కా తువాలు కొనుక్కున్నానంటే నానేం మీద పడిపోతానా? ఈ దిక్కుమాలిన గేమంలో సొక్కా ఎవడిక్కావాలి? తువ్వాలెవడిక్కావాలి? పెద్దపోకిళ్ళకి పోతే ముందుకు నీకే నష్టం" అన్నాడు బక్కునాయుడు. వాళ్ళమ్మ అనేమాటే బక్కునాయుడూ అన్నాడు.

"అమ్మోరు పండక్కి మా యత్తారి వూరు ఎళ్ళాల. మాయమ్మే కొనుక్కోమంది" అన్నాడు వెంకటరెడ్డి.

"మీయమ్మ కొనుక్కోమందా? ఎందుకురా అబద్ధం? మీయమ్మ మాయింటి బొట్టెరో. ఇనాటి పోకిరీలకి అది పోదు.

నాన్నమ్మను నాను వస్తున్నాను, పద పదా!" అని కసిరీశాడు బక్కునాయుడు. వాడి మాటలు బాకుల్లా గుచ్చుకున్నాయి. నయమ్. అక్కడితో వొదిలిపెట్టేడు.

రచ్చరాయి దగ్గర జనం మూగి వున్నారు. మునసబు గౌరినాయుడి గొంతుక వినబడ్డాది. తగువేదో పెద్దదే!

"నాకు నష్టం వచ్చిందా లేదా? సెప్పండి" అని కంచుగంటలాగ ఆడ గొంతుక వినబడ్డాది. కొత్త చొక్కా కొత్త తువ్వాలుతో తగువు మధ్యకి వెళ్ళడానికి భయంవేసింది. దొంగలాగ దొడ్డితోవన వెళ్ళి గుడిసెలో దూరాడు. గుడిసెలో వాడి పెళ్ళాం పిల్లడికి పాలిస్తూ ముక్కాలు పీటమీద కూర్చుంది.

"దిగబడ్డా? ఎక్కడికి సచ్చినావు?" అన్నాది పెళ్ళాం.

"పట్నమెళ్ళినాను." అని డాబుగా అన్నాడు. పెళ్ళాం ఎగాదిగా చూసింది.

"శాన! ఎట్నుంచి వచ్చినావు? దొడ్డి తోవనొచ్చివా? ఊళ్ళో జట్టీ అవుతుంటే?" అడిగింది పెళ్ళాం.

"ఏం జట్టీ?"

"ఏటో ఎళ్ళి సూస్కో మన మళ్ళు కొన్నారుట, గొర్రెల్ని తోలి కోనారుల కుర్రాళ్ళు గడ్డిమేపేస్తున్నారు." అన్నాది పెళ్ళాం. రచ్చరాయి దగ్గర తగవు వాళ్ళమ్మ పెట్టినదే! వెంకటరెడ్డే జట్టీకి మూలం. తగువు వాడి బొచ్చు తువ్వాలూ, చొక్కా!

"మళ్ళలో పెద్ద గడ్డేం నేదు" అన్నాడు వెంకటరెడ్డి.

"గడ్డి నేదూ? మొన్న పడ్డ సినుకులుకి పట్టుకుచ్చునా నెగిసింది గరికె" అన్నాది పెళ్ళాం.

"నోరు ముయ్యి" అని కసిరాడు పెళ్ళాన్ని.

"నోరు మూసుకుండడానికే నిన్ను కట్టుకున్నాను. గడ్డినేదు! గడ్డి కోనారుల కమ్మేసినాడు. బొచ్చుతువ్వాలు కొన్నాడు నా మొగుడు! పెళ్ళాం నోరు మూస్తావు. మీ యమ్మ నోరో?" అన్నాది పెళ్ళాం.

"నోరు ముయ్యమన్నానా?" అన్నాడు మళ్ళా వెంకటరెడ్డి.

"అపసవ్యంగా నోరు మూసుకుంటాను. నువ్వు బేగెళ్ళు" అని పొడిచింది పెళ్ళాం. విసురుగా వెంకటరెడ్డి వెళ్ళాడు.

రచ్చరాయి దగ్గర తగవు రసపట్టులో పడ్డాది. పాతిక ముప్పై గొర్రెల కదుపు ఓ మూల వున్నాది. కదుపు పక్కని బిక్కచచ్చిపోయి ఇద్దరు కోనారుల కుర్రాళ్లు నిలుచున్నారు. గ్రామ మున్సబు గొరినాయుడితో సహా ఊరు ఊరంతా అక్కడే వుంది. అక్కడికి బక్కునాయుడూ

సిద్ధం అయాడు. తగువుకు మూలం వెంకటరెడ్డే. సొక్కా, బొచ్చుతువ్వాలు తగువు! గ్రామనౌకరు కర్ర పట్టుకుని "పవర్"తో నిలబడ్డాడు. వెంకట రెడ్డి రచ్చరాయి దగ్గరకు వెళ్ళాడు. రెండో గ్రామ నౌకరు పెద్దకోనారిని తీసుకొచ్చాడు. చేతులు కట్టుకుని కోనారి నిలబడ్డాడు.

"కోనారీ ముత్తేలమ్మ మళ్ళలో నీ కొడుకులు గొర్రెల్ని పెట్టి మేపేసినారు" అన్నాడు మున్సబు గౌరినాయుడు.

"సిత్తం" అన్నాడు కోనారి.

"నేరం కాదా?" అని గదమాయించాడు మునసబు గౌరినాయుడు.

"నలభై రూపాయలిచ్చి కొనుక్కున్నా మహాప్రభో ?" అన్నాడా కోనారి.

"ఏటేటి? నలభై రూపాయలు నాకిచ్చినావా" అన్నాది ముత్యాలమ్మ.

"నీకియ్యనేదు తల్లీ. నీ కొడుకు ఎంకటరెడ్డి కిచ్చినాను" అన్నాడు కోనారి.

"ఎంకటరెడ్డి ఎంతటోడయ్యాడో సూసినారా!" హేళనగా అంటూ బక్కనాయుడు చుట్టపిల్చి పొగ వొదిలాడు. కొస నమిలి తుసుక్కుమని ఉమ్మేడు.

"నా మళ్ళలో పచ్చగడ్డి కోనారికి నానే అమ్మినాను. డబ్బట్టుకెళ్ళి సొక్కా, బొచ్చు తువ్వాలు కొన్నాను. ఇయిగో సూడండి" అన్నాడు వెంకటరెడ్డి.

"తేలమ్మా సూడు సూడు. నీ కొడుకు బొచ్చు తువ్వాలేసినాడు. జిగి జిగీ సొక్కా తొడిగినాడు" అన్నాడు బక్కనాయుడు. ముత్యాలమ్మ కళ్ళనిండా నీళ్ళు నింపుకొంది. బక్కనాయుడి మాటలు బాధ పెట్టేయి. ఊరందరిమధ్యా బక్కనాయుడు కొడుకుని అంత మాట అనేశాడు!

"నా కొడుకు నాడెమైన వాడైతే నువ్వా మాట అంటావా?" అన్నాది ముత్యాలమ్మ బక్కనాయుణి.

"నాను నాడెమైన పనే చేశాను. గుడ్డనేనివాడు గుడ్డ ఇలవ సెయ్యడు. తాగినోళ్ళు, తప్ప తాగినోళ్ళు సెడతారు. సొక్కా కొనుక్కుంటే సెడిపోరు" అని గట్టిగా అన్నాడు వెంకటరెడ్డి. మునసబు గౌరి

నాయుడు, చుట్టూ వున్న వూరు పెద్దలు తాగుతూ ఉన్నారు. తప్పతాగుతు ఉన్నారు. మొహ మొహాలు చూసుకున్నారు.

"ముత్తేలమ్మా మంచి తగువే తెచ్చినావు. కోనారీ నీ గొర్రెల్ని తోలుకుపో" అన్నాడు మునసబు గౌరినాయుడు. మునసబు ఆ మాట అనీ అనడంతో కోనారుల కుర్రాళ్ళు పెద్ద మొహాల్తో గొర్రెల్ని తోలుకు పోయారు.

"ఎంకటరెడ్డీ నువ్వు చేసిన పని చేసినావుగానీ మీ యమ్మతో సెప్పొద్దా?" అని అడిగాడు మునసబు గౌరినాయుడు. అడిగి మునసబు తనం నిలబెట్టుకున్నాడు.

"సెప్పలేదు" అన్నాడు వెంకటరెడ్డి.

"ఎందుకు సెప్పలేదు?"

"ఇంటికి నాను యజమాన్ని. ఒకపాలి సెప్పకపోతే సెప్పను. ఏటంటారు?" అన్నాడు వెంకటరెడ్డి. నా కొడుకేనా ఈ మాటలు అంటు న్నది అని నిర్ఘాంతపోయింది ముత్యాలమ్మ.

"ముత్తేలమ్మా నిన్ను తేలమ్మా-తేలూ అని ఊరు ఊరంతా పిలుస్తారుకాని నీ తేలుకొండిని నీ కొడుకు కోసీసినాడు" అన్నాడు మునసబు గౌరినాయుడు.

"నన్ను తేలూ - తేలమ్మా అని మీరు పిలుస్తారుకాని ఈ తేలుకి ఏనాడూ కొండి లేదు నాయినా! నా మొగుడునాడు మొగుడుమాట కాద న్నానా? కొడుకునాడు కొడుకుమాట కాదంటానా?" అని గుడ్లనిండా నీళ్ళు నింపుకుని ఉక్కిరిబిక్కిరి అయిపోయింది ముత్యాలమ్మ.

"నేరక ఈ తగువెట్టినాను. కొడుకుని రచ్చరాయికి ఈడ్చినాను." అంటూ వలవలా ఏడ్చింది ముత్యాలమ్మ.